'అనధికారిక' ప్రారంభోత్సవం

- డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో అదనపు భవనం ప్రారంభించిన భట్టి సతీమణి నందిని
- చర్చనీయాంశమైన కార్యక్రమం

ప్రారంభోత్సవం తర్వాత ప్రత్యేక పూజలు చేస్తున్న భట్టి సతీమణి నందిని

మామిళ్లగూడెం, డిసెంబర్ 7 : ఖమ్మంలోని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు భవనానికి డిప్యూటీ సీఎం సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం రూ.90 లక్షలతో ఖమ్మం వీడీవోస్ కాలనీ ప్రజా భవన్ క్యాంపు కార్యాలయంలో మరో ఆధునిక భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ భవనంలో సెక్యూరిటీ కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆ విభాగం నిర్మాణంలో ఉన్నదని ఆర్అండ్‌బీ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ సాధారణ నిధులతో నిర్మించిన భవనాన్ని అనధికారికంగా కాంగ్రెస్ నాయకుల చేత ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది.

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఎన్‌హెచ్‌పై భారీగా నెలకొన్న ట్రాఫిక్ జామ్

హైవేను బ్లాక్ చేసిన ఎంపీ చామల

- రాహుల్‌పై బీజేపీ వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో
- భారీగా ట్రాఫిక్ జామ్.. రద్దీలో ఇరుక్కున్న అంబులెన్స్

హయత్‌నగర్, డిసెంబర్ 7: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట అధికారపార్టీ నేతలు నానా హంగామా సృష్టించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ శ్రేణుల కార్లను పోలీస్‌స్టేషన్ ఎదుట విజయవాడ జాతీయ రహదారిపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు గంటన్నర పాటు ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ ఆవరణంతా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. తమ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యక్తిత్వాన్ని బీజేపీ గుజరాత్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతూ కించపరుస్తున్నారని ఆరోపిస్తూ ఎంపీ, ఎమ్మెల్యే హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్, ఐటీ చట్టంలోని 336/1, 353/1 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

ట్రిపుల్ ఆర్ బాధితులకు బీఆర్ఎస్ అండ

- పచ్చని పొలాలు పోతున్నా కనికరించని సర్కారు
- ఏమార్చడం, మోసం చేయడమే కాంగ్రెస్ నైజం
- ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో నిలదీస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఆర్ బాధితులు

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తేతెలంగాణ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులు పచ్చని పంట పొలాలు, ఇండ్లు, ప్లాట్లు కోల్పోతున్నా.. సర్కారు పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్ బాధితులకు తగిన పరిహారం ఇస్తామని భువనగిరి సభలో ప్రియాంకగాంధీతో హామీ ఇప్పించిన ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పుడు మాట మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులు హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు చేస్తూ, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టించుకుంటున్నారని వాపోయారు. 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా తక్కువ పరిహారమిచ్చి భూములు గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యలపై అసెంబ్లీలో నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు బాధితులకు ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల హామీని నెరవేర్చేదాకా బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అసెంబ్లీలో పోరాడుతుందని అభయమిచ్చారు.

మోసం కాంగ్రెస్ నైజం

ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత సీఎంతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డిపై ఉన్నదని హరీశ్‌రావు స్పష్టంచేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవడం, చౌటుప్పల్ వద్ద 78 ఎకరాల్లో ఉన్న రింగ్‌రోడ్డును అలైన్‌మెంట్ మార్చి 184 ఎకరాలకు పెంచడంతో మున్సిపాలిటీ రెండుగా విడిపోతున్నదని చెప్పారు. దీంతో రైతులు రెండు పంటలు పండే బంగారు భూములు, విలువైన ఇండ్లు, ప్లాట్లు కోల్పోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీగా ఉన్న సందర్భంలో బాధితులతో కలిసి ధర్నాలు చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇప్పుడు పోలీసు బలగాల మధ్య నిర్బంధంగా సర్వే చేయించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఏమార్చడం, మోసం చేయడం కాంగ్రెస్ నేతలకు వెన్నతోపెట్టిన విద్య అని దుయ్యబట్టారు. ఇదే తరహాలో ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట పచ్చని పొలాల మధ్య చిచ్చుపెట్టి లగచర్ల గిరిజన బిడ్డలను జైలుపాలు చేసిన పాపం కాంగ్రెస్‌దేనని విమర్శించారు 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పటికైనా కండ్లు తెరిచి ట్రిపుల్ ఆర్ రైతులను మభ్యపెట్టడం మానేసి, ఇచ్చిన హామీలను అమలు చేయాలి. లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది' అని హెచ్చరించారు. ప్రభుత్వం దిగిరాకుంటే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తామని స్పష్టంచేశారు.

దివ్యాంగులకు సైతం మోసం

నాలుగు వేల పింఛన్‌ను ఆరు వేలకు పెంచుతామంటూ దివ్యాంగులను సైతం కాంగ్రెస్ మోసం చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. దివ్యాంగులు వారి కుటుంబాలకు భారం కావొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ రూ.4వేల పింఛన్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా దివ్యాంగులకు పింఛన్ ఇవ్వడంతోపాటు విద్య, ఉద్యోగావకాశాలు కల్పించారని చెప్పారు. కానీ, వారికి అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏడాది పూర్తయినా ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 26న నిర్వహించనున్న మహాధర్నాకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా వారికి హరీశ్‌రావు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పద్మశాలీల కోసం వెయ్యి కోట్లు కేటాయించాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, డిసెంబర్7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పద్మశాలీల అభ్యున్నతికి రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్, పద్మశాలీ కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పద్మశాలి సామాజిక వర్గానికి ప్రభుత్వ శాఖల్లో ప్రాతినిధ్యమే కరువైందని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావం, అనంతర పరిణామాల్లో పద్మశాలీలు కీలకపాత్ర పోషించారని, దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో విస్తరించి, పలు రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్న పద్మశాలీలను తెలంగాణ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన నామినేటెడ్, విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు.

ఇరికించారు.. ఊపిరి తీశారు..!

- డీజిల్ స్కాంలో నిందితుడు రఘు గుండెపోటుతో మృతి

వరంగల్, డిసెంబర్ 7: 'అన్యాయంగా డీజిల్ స్కాంలో ఇరికించారు. మానసిక వేదనకు గురిచేశారు. చివరికి ఊపిరి తీశారు'.. అంటూ డీజిల్ స్కాంలో రెండేళ్ల క్రితం సస్పెండ్‌కు గురైన కనకం రఘు కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం గుండెపోటుతో మృతి చెందిన రఘు (50) మృతదేహంతో బల్దియా ఎదుట ఆందోళనకు దిగారు. రెండున్నరేళ్ల కిత్రం బల్దియాలో రూ.40 లక్షల డీజిల్ కుంభకోణంలో డీజిల్ ఇన్‌చార్జిగా ఉన్న పీహెచ్ వర్కర్ రఘు ప్రమేయం ఉందన్న ఆరోపణలతో అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో రఘు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉద్యోగంలోకి తీసుకోవాలని ఇటీవల ఆదేశించినా అధికారులు పట్టించుకోకుండా నెల రోజుల కిత్రం క్రిమినల్ కేసు పెట్టారు. దీంతో మానసిక వేదనకు గురైన రఘు గుండెపోటుతో మరణించినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుటుంబసభ్యులతో అదనపు కమిషనర్ జోనా చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని, ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా కమిషనర్ దృష్టికి తీసుకపోతానని హామీ ఇచ్చారు.

చేయని రుణమాఫీనే అడుగుతరా?

ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అసహనం

తిమ్మాజిపేట, డిసెంబర్ 7 : 'ప్రభుత్వం రూ.2 లక్షలలోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. ఆ విషయం ఎవరూ చెప్పరు.. 2 లక్షలకుపైగా ఉన్న రుణమాఫీ గురించి మాత్రం అడుగుతరు' అంటూ కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు రుణమాఫీపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురంలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

చండూరు, డిసెంబర్7: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని పూర్తి స్థాయిలో చేపట్టాలని కోరుతూ శనివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం రైతులు రాస్తారోకో నిర్వహించారు. సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూరైనా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి:తమ్మినేని

ఖమ్మం జిల్లా మధిరలో మాట్లాడుతున్న సీపీఎం నేత తమ్మినేని

మధిర రూరల్, డిసెంబర్ 7 : రైతులందరికీ ఉత్తుత్తి రుణమాఫీ కాకుండా.. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మల్లారం గ్రామంలో శనివారం నిర్వహించిన సీపీఎం మధిర డివిజన్ మహాసభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికలకు ముందు సాధ్యంకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా మాయమాటలతో కాలం గడుపుతున్నదని విమర్శించారు. ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, పేద, మధ్యతరగతి, కర్షకుల పక్షాన సీపీఎం పోరాడుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయం: సీతక్క

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు అవకాశం కల్పిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బేగంపేటలోని హరితప్లాజాలో తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసిన మహిళా యువ వ్యాపారవేత్తల ప్రోత్సాహక ప్రదర్శనలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అతివలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

కొబ్బరిపొడి తయారీ కేంద్రంపై దాడులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): బేగంపేటలోని ఆకాష్ ట్రేడింగ్ కంపెనీపై శనివారం దాడులు నిర్వహించారు. వంటకాల్లో వినియోగించే కొబ్బరిపొడి కల్తీ చేస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు రూ.92.47లక్షల విలువజేసే 60,050 కేజీల కొబ్బరి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారిపై ఎఫ్ఎస్ఎస్ యాక్ట్ 2006 ప్రకారం చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

పెరిగిందెక్కడ? తగ్గుడే!

మొదటిపేజీ తరువాయి...

విడుదల చేసిన ముందస్తు అంచనా నివేదిక ప్రకారం.. గత వానకాలంతో పోల్చితే ఈ ఏడాది వానకాలంలో వరి సాగు విస్తీర్ణం 0.41% తగ్గినట్టు వెల్లడైంది. ధాన్యం ఉత్పత్తి 54 వేల టన్నులు, బియ్యం ఉత్పత్తి కూడా 5.12% తగ్గినట్టు తెలిపింది. 2023-24 వానకాలంలో 26.68 లక్షల హెక్టార్లు (65.89 లక్షల ఎకరాలు)లో వరి సాగు కాగా, ఈ ఏడాది (2024-25) వానకాలంలో 26.57 లక్షల హెక్టార్లు (65.62 లక్షల ఎకరాలు)లో వరి సాగైనట్టు వ్యవసాయ శాఖ పేర్కొన్నది. నిరుడు వానకాలంలో 1,44,85,000 టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఈ ఏడాది వానకాలంలో 1,44,31,000 టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు తెలిపింది. ఈ లెక్కన గత సంవత్సరం కంటే వరి సాగు విస్తీర్ణం 27 వేల ఎకరాలు, ధాన్యం ఉత్పత్తి 54 వేల టన్నులు తగ్గింది. అంతేకాదు, గత ఏడాదితో పోల్చితే పత్తి సాగు కూడా 1.98% తగ్గినట్టు వ్యవసాయ శాఖ వెల్లడించడం గమనార్హం. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు మాత్రం గొప్పలకు పోయి రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయినట్టు తప్పుడు ప్రకటనలు చేస్తుండటం విమర్శలకు తావిస్తున్నది.

బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం

కాళేశ్వరం నీళ్లు లేకున్నా గత సంవత్సరంతో పోల్చితే రికార్డు స్థాయిలో 153 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది తెలంగాణ చరిత్రలోనే అత్యధికమని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు చెప్తున్నారు. గత ఏడాది వానకాలం సాగు సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో ఈ సారి అధిక ధాన్యం ఉత్పత్తి అయినట్టు ప్రచారం చేయడం ద్వారా గత బీఆర్ఎస్ సర్కారు వైఫల్యం చెందిందని ప్రజల్లోకి తీసుకెళ్లొచ్చని ప్రభుత్వ పెద్దలు భావించినట్టు స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలోనే వరి సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి తగ్గినా వివిధ సభల్లో తప్పుడు లెక్కలు చెప్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ తాజా గణాంకాల నేపథ్యంలో సీఎం, మంత్రులు ఏం సమాధానం చెప్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఏం చేసిందని పెరుగుతుంది?

వరి సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి పెరిగిందంటూ ముఖ్యమంత్రే అబద్ధాలు చెప్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు ఏం చేసిందని సాగు విస్తీర్ణం పెరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. ఈ వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టిన విషయం మర్చిపోయారా? అని నిలదీస్తున్నారు. రైతుబంధు అందక, పెట్టుబడికి ఎన్ని ఇబ్బందులు పడ్డామో, ఎంత గోస పడ్డమో మీకేం తెలుసని మండిపడుతున్నారు. రుణమాఫీ అందరికీ చేయలేదు. సకాలంలో ఎరువులు కూడా ఇయ్యలేకపోతిరి.. ఇక సాగు, ఉత్పత్తి ఎలా పెరుగుతుందని ప్రశ్నలు సంధిస్తున్నారు.



వ్యవసాయ శాఖ వెల్లడించిన తాజా లెక్కలు

సంవత్సరం	వరి సాగు (లక్షల హెక్టార్లు)	ధాన్యం ఉత్పత్తి (లక్షల టన్నులు)	బియ్యం ఉత్పత్తి (లక్షల టన్నులు)
2023-24	26.68	1,44,85000	97.65
2024-25	26.57	1,44,31000	92.65
తేడా	-0.41%	54,000	-5.12%

వేలానికి స్వగృహ ఇండ్లు!

3వేల కోట్లు వస్తాయని ప్రభుత్వ అంచనా

హైదరాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): రాజీవ్ స్వగృహ గృహాల వేలానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందులో కొన్ని ప్లాట్లు, స్థలాలు, పూర్తికాని అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. హైదరాబాద్, ఖమ్మం, వికారాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లోని గృహాలు, స్థలాల వేలంతో ఖజానాకు రూ. 3,000కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

మిగిలిపోయిన ఇండ్ల అమ్మకం

ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2007లో రాజీవ్ స్వగృహ స్కీమ్ ప్రారంభించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనేది స్కీమ్ ఉద్దేశం. వివిధ ప్రాంతాల్లో సిద్ధం చేసిన ఇండ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లకు ఆరుసార్లు నిర్వహించిన వేలంలో 2956 ఫ్లాట్లు విక్రయించగా, 760ఫ్లాట్లు మిగిలి ఉన్నాయి. వీటి ధరలు నిర్ణయించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. నిర్మాణం పూర్తయిన ఇండ్లను ప్రజలకు, పూర్తికాని వాటిని బిల్డర్లకు విక్రయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, పక్కన బాలలత

దివ్యాంగులు లేకుండానే విజయోత్సవాలా?

ఖైరతాబాద్, డిసెంబర్ 7: దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే, వారి ప్రాతినిధ్యం లేకుండానే ప్రభుత్వం విజయోత్సవాలు ఎలా నిర్వహిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ప్రశ్నించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఏడాది అంతా కలిపి దివ్యాంగులకు రూ.12 వేలకోట్లు సర్కారు బకాయి పడిందని ఆరోపించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాలలత మాట్లాడుతూ.. దివ్యాంగులు చట్టసభల్లోకి రావాలని, వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఐదుగురు యువకుల జలసమాధి

- ప్రాణాలతో బయటపడ్డ ఒకరు
- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- యాదాద్రి జిల్లాలో ఘోర దుర్ఘటన

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7: స్నేహితుల సరదా ప్రాణాలనే బలి తీసుకున్నది. కారులో బయలుదేరిన వారి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. యాదాద్రి జిల్లా జలాల్‌పూర్ వద్ద జరిగిన ఘోర దుర్ఘటనలో ఐదుగురు యువకులు మృతిచెందగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని సిరినగర్ కాలనీకి చెందిన వంశీగౌడ్ (23), విగ్నేశ్ (21), ర్యాపిడో డ్రైవర్ హర్షవర్ధన్ (21), బల్లూ (19), వినయ్ (20), మణికాంత్ కలిసి శుక్రవారం అర్ధరాత్రి కారులో సరదాగా బయలుదేరారు. ఈత కల్లు కోసం శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భూదాన్‌పోచంపల్లికి చేరుకున్నారు. టిఫిన్ కోసం రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొత్తగూడెనికి వెళ్లారు. తిరిగి పోచంపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలో జలాల్‌పూర్ చెరువు కట్టపై కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఐదుగురు యువకులు జలసమాధి అయ్యారు. మణికాంత్ మాత్రం కారు అద్దాలు ధ్వంసం చేసి బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ఎస్సై భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

22ఏ భూముల్లో.. 420 దందా!

మొదటిపేజీ తరువాయి...

కుమారుడితో కలిసి సెటిల్‌మెంట్లకు కౌంటర్ తెరిచినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 5 ఎకరాలు ఒక చోట, 25 ఎకరాలు మరో చోట, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో100, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో 100 ఎకరాలు 22ఏ కింద ఉన్నాయి. ఇప్పుడు వాటిని ఆ జాబితా నుంచి తప్పించి, ప్రైవేటు పట్టాలు ఇచ్చేందుకు 50 శాతం భూ వాటాతో ఒప్పందం కుదిరినట్టు 'నమస్తే తెలంగాణకు' పక్కా సమాచారం అందింది. 2007లో 22ఏ రిజిస్ట్రేషన్ చట్టం అమల్లోకి వచ్చింది. పట్టా భూములకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఆక్రమించేస్తున్నారు. ఇలా వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైన ఘటనలు వెలుగుచూసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 22ఏ రిజిస్ట్రేషన్ సవరణ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. 22ఏ జాబితాను రూపొందించే క్రమంలో జరిగిన పొరపాట్ల కారణంగా అక్కడక్కడ పట్టా భూములు కూడా ఆ జాబితాలోనే చేరాయి.

డిమాండ్ ఉన్న ప్రాంతాలపై మంత్రి కన్ను

ఒకే సర్వే నంబరులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి ఉన్నప్పుడు ఆ సర్వే నంబరు మొత్తం రిజిస్ట్రేషన్ నిషేధ జాబితాలోకి వెళ్లిపోయింది. సెటిల్‌మెంట్ రికార్డు ఆధారంగా సేత్వార్, ఖాస్రా పహణి, చేసాల పహణి పరిశీలించి ఈ భూముల్లో పట్టా ఏది? ప్రభుత్వ భూమి ఏది నిర్ధారించి వేరు పరిచే అధికారం రెవెన్యూ శాఖకు ఉంది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూముల నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. ఇటువంటి భూముల మీదపైనే కీలక మంత్రి కన్నేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో 22ఏ కింద ఉన్న భూముల జాబితాను తెప్పించినట్టు ప్రచారం జరుగుతున్నది. రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత ఎక్కువగా డిమాండ్ ఉన్న కొండాపూర్, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపూర్, పటాన్‌చెరు ప్రాంతంలోని భూముల మీద మంత్రి కన్నేసి కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

దగ్గరుండి చక్కబెడుతున్న మంత్రి కొడుకు

ఐదు రకాల నిషేధిత భూముల్లో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా, ప్రభుత్వపరంగా చెడ్డపేరు లేకుండా 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి అనువైన భూములను గుర్తించడానికి రెవెన్యూ శాఖ మీద పట్టున్న ఒక సీనియర్ ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఇటువంటి భూములను గుర్తించి, సంబంధిత భూ యజమానులతో సంప్రదింపులు చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం సదరు కీలక మంత్రి కొడుకు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని నడిపిస్తున్నట్టు చెప్తున్నారు. నిషేధిత జాబితా నుంచి తమ భూమిని తప్పించాలని పెట్టుకున్న వినతి పత్రాల నుంచి ఆయా భూయజమానుల వివరాలు, వారి ఇంటి చిరునామాను గుర్తించి బేరసారాలకు పిలుస్తున్నట్టు తెలిసింది. ఇటీవల కాలంలో కొండాపూర్ నుంచి మియాపూర్ వెళ్లే దారిలోని ప్రైమ్ లొకేషన్‌లో వక్ఫ్ ఇనాంకు సంబంధించిన 5 ఎకరాల భూమిని 50 శాతం భూ వాటాతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ భూమి ప్రభుత్వ, పట్టా పంచాయతీతో 14 ఏళ్లుగా 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంది. ఈ భూమికి సంబంధించి ఆరుగురు యజమానులు ఉండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కీలక మంత్రి వారిని పిలిపించి మాట్లాడి డీల్ సెటిల్ చేసినట్టు తెలిసింది. మంత్రి కొడుకు 50 శాతా వాటాతో ఒప్పందం చేసుకొని, ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించినట్టు సమాచారం. మొత్తం ఐదు అంతస్తుల భవన నిర్మాణాలు చేయాలని, వీటిలో గ్రౌండ్ ఫ్లోర్ కమర్షియల్ స్పేస్‌గా, మిగిలిన ఫోర్లు రెసిడెయన్షియల్ ఫ్లాట్లుగా నిర్మాణం చేయాలని ఒప్పందం జరిగినట్టు తెలిసింది. అదే చోట వారసత్వ వక్ఫ్ ఇనాంగా ఉన్న 25 ఎకరాల భూమికి సంబంధించి కూడా ఇదే తరహా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం.

50 శాతం వాటాతో 100 ఎకరాలకు ఒప్పందం!

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ గ్రామంలో ఓఆర్ఆర్‌కు అతి సమీపంలోనే 100 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తులకు మధ్య దాదాపు 20 ఏండ్ల నుంచీ పంచాయితీ నడుస్తున్నది. జిల్లా కోర్టులు, హైకోర్టుల్లోనూ కేసులు నడుస్తున్నాయి. ఈ భూమికి దాదాపు 15 మంది రైతులు యాజమానులుగా ఉన్నారు. వీరిలో కొందరిని మంత్రి పిలిపించి మాట్లాడినట్టు తెలిసింది. 50 శాతం వాటాతో 100 ఎకరాలను 22ఏ నుంచి తప్పించే విధంగా ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఇదే జిల్లా అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 30లో ఉన్న 400 ఎకరాలను దశలవారీగా 22ఏ నుంచి తప్పించి, ప్రైవేటు పట్టాలు ఇప్పించే ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ భూమిలో 100 ఎకరాలను ప్రైవేటు పట్టా సర్టిఫికెట్లు జారీ చేసినట్టు 'నమస్తే తెలంగాణ' వద్ద పక్కా సమాచారం ఉంది. కీలక మంత్రికి అత్యంత సన్నిహితంగా మెలిగే ఆర్‌సీపురం మండల కేంద్రంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి రంగంలోకి దిగారు. 100 ఎకరాల భూమిని స్వాధీనంలోకి తీసుకొని దాని చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేశారు. దీనికి విద్యుత్తుశాఖ అధికారులు అగమేఘాల మీద కరెంటు స్తంభాలు వేసి ఎల్‌టీ లైన్ వేశారు. మూడు బుల్డోజర్లు పెట్టి రాత్రింబవళ్లు గుట్టలను చదును చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. డిటోనేటర్లు పెట్టి రాత్రికి రాత్రి గుట్టలను పేల్చి వేస్తున్నా పోలీసులు చెవులు మూసుకున్నారు. పెద్ద పెద్ద గుట్టలను పూర్తిగా తొలిచేసి చదును చేశారు. మట్టి రోడ్లు పోశారు. గదులు నిర్మించారు. దీన్ని 'నమస్తే తెలంగాణ' పత్రిక వెలుగులోకి తెచ్చిన రోజు రెవెన్యూ అధికారులు కొద్దిసేపు హడావుడి చేశారు. ఫెన్సింగ్ కూలగొట్టినట్టు హడావుడి చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మళ్లీ అక్కడ పనులు కొనసాగుతున్నట్టు సమాచారం.

యాసిడ్ ఘాటుతో విద్యార్థులకు అస్వస్థత

- చింతల్ శ్రీచైతన్య స్కూల్‌లో ఘటన
- దవాఖానపాలైన 15మంది


చికిత్స పొందుతున్న విద్యార్థిని

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): చింతల్‌లోని శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులు దవాఖానపాలయ్యారు. పాఠశాల భవనం మూడో అంతస్తులోని మరుగుదొడ్లను సిబ్బంది యాసిడ్‌తో క్లీన్ చేసి, తలుపులు వేసి వెళ్లారు. లోపల గాలి మొత్తం ఘాటైన వాసనతో నిండిపోయింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు బాత్‌రూమ్‌కు వెళ్లగా తలుపులు తీయగానే ఒక్కసారిగా ఘాటైన వాసన రావడంతో 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని పాఠశాల నిర్వాహకులు సమీపంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు అంటూ తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు.